సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 22 । జూన్ । 2025



పంచాయతీలకు భవనాలు

ఈజీఎస్ పథకం నుంచి నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. 8లో▸



గోడౌన్‌లో అగ్నిప్రమాదం

డెకరేషన్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 8లో▸



నిర్లక్ష్యం తగదు

ఉపాధ్యాయులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం తగదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల శ్రీకాంత్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

9999 @ రూ.5.50 లక్షలు

షాద్‌నగర్‌: ఫ్యాన్సీ నంబర్లపై వాహన యజమానుల్లో ఆసక్తి అంతకంతకూ పెరుగుతోంది. తమకు ఇష్టమైన, కలిసొచ్చే నంబర్లను దక్కించుకోవడానికి ఎంత చెల్లించడానికైనా వెనుకంజ వేయడం లేదు. షాద్‌నగర్‌లోని రవాణా కార్యాలయంలో శనివారం జరిగిన వేలంలో టీజీ 07బీ 9999 నంబర్ ఏకంగా రూ.5.50 లక్షలు పలికింది. కంసాన్‌పల్లికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి పద్మ నరేందర్‌రెడ్డి తన ఓల్వో కారుకు ఈ నంబర్‌ను వేలంలో దక్కించుకున్నాడు.

న్యాయపరిపాలనలో శిక్షణకు ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్‌: న్యాయ పరిపాలనలో శిక్షణకు రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల నుంచి షెడ్యూల్డ్ కులాలకు చెందిన లా గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 సంవత్సరానికి గాను సెంట్రల్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌చే గుర్తించిన ఇన్‌స్టిట్యూషన్స్, సెంట్రల్ యాక్ట్, ప్రొవిజనల్ యాక్ట్ లేదా ఇన్ కార్పొరేషన్ చేసిన లేదా స్థాపించబడిన దేశంలోని ఏదేని యూనివర్సిటీ నుంచి ఏదేని ఫ్యాకల్టీలో బేసిక్ డిగ్రీ, లా డిగ్రీ పొందిన వారు అర్హులని తెలిపారు. వార్షికాదాయం రూ.2 లక్షలు మించొద్దని, అభ్యర్థి గత సంవత్సరంలో ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని ఉండకూడదని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు న్యాయ పరిపాలనలో మూడేళ్ల వ్యవధికి శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.3వేలు స్టయిఫండ్, మొదటి సంవత్సరం లా పుస్తకాలు, ఫర్నిచర్ కొనుగోలు నిమిత్తం రూ.50 వేలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు జిల్లా కోర్టులు, మొబైల్ కోర్టులు, సెషన్ కోర్టు, డివిజన్ స్థాయి, తాలుకా స్థాయి కోర్టుల్లో గవర్నమెంట్ ప్లీడర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వద్ద శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 30న ఒరిజినల్ సర్టిఫికెట్లతో రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

గౌడ సంఘం జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా అనురాధ



నియామకపత్రం అందుకుంటున్న అనురాధ

హయత్‌నగర్‌: అఖిల భారత గౌడ సంఘం జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కుంట్లూర్‌కు చెందిన మాదుగుల అనురాధ నియమితులయ్యారు. చింతల్ కుంటలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్ చేతుల మీదుగా ఆమె నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ.. గౌడ విద్యార్థులు, మహిళలు సామాజికంగా ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిద్దెల మల్లేశంగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దగోని నాగేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు బోయిపల్లి శేఖర్‌గౌడ్, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, జిల్లా ఉపాధ్యక్షుడు పండాల దశరథగౌడ్, కార్యదర్శి గోపగాని వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

భూ బాధితులకు సుంకాల నుంచి మినహాయింపు


మహేశ్వరం: మండల పరిధిలోని రావిర్యాల ఫ్యాబ్‌సిటీ (ఈ–సిటీ)లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఇచ్చే ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం 222 మంది రైతులకు స్టాంపు, రిజిస్ట్రేషన్, సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చింది. టీజీఐఐసీ అధికారులు హెచ్‌ఎండీఏ నిబంధనల ప్రకారం హౌసింగ్ లేఅవుట్ అభివృద్ధి పర్చి అందులో అన్ని వసతులతో ప్లాట్లు ఇవ్వనున్నారు. ప్రభుత్వం పరిహారంగా ఇచ్చే ప్లాట్లకు స్టాంపు, రిజిస్ట్రేషన్, ఇతర సుంకాల నుంచి రూ.3,72,91,500 మినహాయింపు ఇచ్చినట్లు కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, టీజీఐఐసీ శంషాబాద్ జోనల్ మేనేజర్ శ్రవణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చదరపు గజానికి రూ.2,800 స్టాంపు, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇచ్చారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 2025 – 26 సంవత్సరానికి సివిల్స్, ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఉచిత శిక్షణ కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.



కడ్తాల్‌: విద్యార్థుల యోగా విన్యాసం



హుడాకాంప్లెక్స్‌: ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి యోగాసనం



మీర్‌పేట: ఆసనాలు వేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

యోగా.. సందడిగా

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఉల్లాసంగా జరుపుకొన్నారు. జిల్లా వ్యాప్తంగా చిన్నాపెద్దా తేడా లేకుండా యోగాసనాలు వేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు చోట్ల ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. పలు విద్యాసంస్థలు, యువజన, స్వచ్ఛంద సంస్థలు, ఆయా పార్టీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగా అలవాటుగా చేసుకోవాలని, యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతాయని విశిష్టతను చాటిచెప్పారు.

అర్జీల వెల్లువ

భూ భారతి సదస్సులకు బాధితుల క్యూ

- జిల్లా వ్యాప్తంగా 21,200 దరఖాస్తులు రాక
- ఆన్‌లైన్ ద్వారా ఇప్పటికే 17 వేలకుపైగా పెండింగ్
- తీవ్ర పని ఒత్తిడిలో రెవెన్యూ యంత్రాంగం
- మాడ్యుల్స్ వారీగా వివరాలు నమోదు చేస్తున్న అధికారులు



కేశంపేటలో రైతుకు ప్రొసీడింగ్ అందిస్తున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా మిగిలి ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈనెల 3 నుంచి గ్రామాల వారీగా భూ భారతి సదస్సులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లు బృందాలుగా విడిపోయి గ్రామాలకు చేరుకుని బాధితుల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరిస్తుండడం విధితమే. 27 మండలాల్లో 613 రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ బాధితుల నుంచి 21,200 దరఖాస్తులు స్వీకరించారు. అత్యధిక దరఖాస్తులు అందిన మండలాల జాబితాలో మంచాల (2,459) ముందు వరుసలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో యాచారం (1,867), కందుకూరు (1,863) ఉన్నాయి. అత్యల్ప అర్జీలు అందిన మండలాల జాబితాలో సరూర్‌నగర్ (0), హయత్‌నగర్ (3), రాజేంద్రనగర్ (7) నిలిచాయి. ఇప్పటికే 17 వేల మందికిపైగా బాధితులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులన్నీ కలెక్టర్, అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, తహసీల్దార్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కాకుండా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో మరో 60 అర్జీల వరకు వచ్చి చేరుతున్నాయి. రోజుకు సగటున 150 దరఖాస్తులను ఆమోదించడమో/తిరస్కరించడమో చేస్తున్నారు. కొత్తగా అదే స్థాయిలో వచ్చి చేరుతున్నాయి. తాజాగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మరికొన్ని దరఖాస్తులు రావడం గమనార్హం. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న వాటితో పాటు కొత్తగా వచ్చి చేరిన అర్జీల పరిష్కారం రెవెన్యూ అధికారుకుల తలకుమించిన భారంగా మారుతోంది.

ఆయా మండలాల్లో ఇదీ పరిస్థితి

- పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన కొందుర్గు మండలం నుంచి 573 అర్జీలు స్వీకరించారు.
- యాచారం మండలం మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, యాచారం, చింతపట్ల, మాల్, నల్లవెల్లి, నస్దిక్‌సింగారం గ్రామాల్లోనే ఎక్కువ భూ సమస్యలు ఉన్నట్లు తేలింది. కందుకూరులో మిస్సింగ్ సర్వే నంబర్లు సరి చేయడం కోసం 583, పెండింగ్ మ్యూటేషన్లు 172, డీఎస్ పెండింగ్ 101, విస్తీర్ణం సరిచేయడం కోసం 266, భూమి స్వభావానికి సంబంధించి 22, పట్టాదారు పేరు సరిచేయడం 77, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని 253, ఓఆర్సీ కోసం 338, ఈ సర్టిఫికెట్ కోసం 1, సక్సేషన్ కోసం 213, ఇతర సమస్యల పరిష్కారం కోసం 172 దరఖాస్తులు అందాయి.
- కడ్తాల్ మండలంలో మిస్సింగ్ సర్వే నంబర్లు 270, పెండింగ్ మ్యూటేషన్ 65, విస్తీర్ణం తగ్గుదల 178, భూమి స్వరూపం మార్పు 62, నిషేధిత జాబితా నుంచి తొలగింపు కోసం 85, వారసత్వ పట్టా అమలు కోసం 38, కొత్త పాసు బుక్‌ల కోసం74, పేర్ల నమోదులో దొర్లిన తప్పులను సరి చేయడం, ఆధార్ నమోదు, కులం తప్పుగా నమోదుకు సంబంధించి 65, ఇతర దరఖాస్తులు 74 వరకు ఉన్నాయి.
- ఇబ్రహీంపట్నంలో 1,185 అర్జీలు అందగా, వీటిలో ఆరు సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉండిపోయాయి.
- కేశంపేటలో మిస్సింగ్ సర్వేనంబర్ 165, మ్యూటేషన్ పెండింగ్ 6, డీఎస్ పెండింగ్ 30, ల్యాండ్ విస్తీర్ణం 44, భూమి స్వభావం 12, భూయజమాని వివరాలు 10, నిషేధిత జాబితా 46, అసైన్డ్‌ల్యాండ్ 3, విరాసత్ 9 దరఖాస్తులు ఉన్నాయి.
- చేవెళ్లలో సర్వేనంబర్‌కు సంబంధించి 542, పెండింగ్ మ్యూటేషన్, కోర్టు ఆర్డర్‌కు సంబంధించి 48, డీఎస్ పెండింగ్ 153 అర్జీలు రాగా, ఎక్స్‌టెంట్ కరెక్షన్‌కు సంబంధించినవి 37, పేర్లు తప్పులు, మిస్సింగ్ 74, నిషేధిత జాబితా 57, అసైన్డ్ భూమికి సంబంధించి 1, ఓఆర్‌సీపై 4, సక్సేషన్ 39, ఆక్రమణలకు సంబంధించి 9, ఇతర సమస్యలపై 24 ఫిర్యాదులు అందాయి.
- మొయినాబాద్ మండలంలో 377 మిస్సింగ్ సర్వే నంబర్లు, 46 డీఎస్ పెండింగ్, 56 ఎక్స్‌టెంట్ కరెక్షన్, 76 భూ స్వభావం, 16 పట్టాదారు పేర్లలో తప్పులు, 107 నిషేధిత జాబితా, 112 సక్సేషన్, 121 ఇతర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి.

పరిష్కారం దొరుకుతుంది



గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. వచ్చిన అర్జీలను స్వీకరించాం. ఎప్పటికప్పుడు నమోదు చేసుకున్నాం. ఆయా సమస్యలను బట్టి సమయానుకూలంగా నోటీసులు ఇచ్చి భూ భారతిలో పరిష్కరించే విధంగా చూస్తాం.

– కృష్ణయ్య, తహసీల్దార్, చేవెళ్ల

పేదల ఇళ్లు కూల్చేయొద్దు



ఎమ్మెల్యే సబితా రెడ్డికి ట్యాక్స్ పత్రాలు చూపిస్తున్న స్థానికులు

- నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్‌: దశాబ్దాలుగా నివాసం ఉంటూ ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్న పేదల ఇళ్లను కూల్చే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి డిమాండ్ చేశారు. జల్‌పల్లి మున్సిపల్ పరిధి ఎర్రకుంట సమీపంలోని షాహిన్‌నగర్ మర్కజ్, క్యూబా కాలనీవాసులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు తమ గోడు వెల్లబోసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రూపాయి రూపాయి కూడబెట్టుకుని కష్టపడి ఇళ్లు కట్టుకొని 15–20 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న వారిని ఇబ్బంది పెట్టడం సరైంది కాదన్నారు. దాదాపు 400 ఇళ్లను ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ కూల్చేందుకు మార్కింగ్ చేయడం తగదన్నారు. ప్రభుత్వం ఒక స్పష్టత అంటూ లేకుండా పాలన సాగిస్తోందని విమర్శించారు. పట్టణ ప్రాంత చెరువులు, గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను వేర్వేరుగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. హైడ్రా పేరుతో ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వీధి వ్యాపారులను సైతం రోడ్డున పడేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రాం, మాజీ చైర్మన్ అబ్దుల్లా సాది, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు బదర్ అలీ, హుస్సేనీ, సూరెడ్డి కృష్ణారెడ్డి, షర్ఫుద్దీన్ హామెద్, అలీ మన్సూరీ, పల్లపు శంకర్, హసన్ షా, దస్తగిర్, బర్కత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్సాఫ్ లేడీ పోలీస్



బాబును మహిళా కానిస్టేబుల్‌కు అప్పగించి పరీక్షకు వెళ్తున్న తల్లి

మీర్‌పేట: భార్యాభర్తలిద్దరూ తమ రెండేళ్ల కొడుకును తీసుకుని పరీక్ష రాసేందుకు సెంటర్‌కు చేరుకున్నారు. చిన్నారిని ఎవరి వద్ద ఉంచాలో తెలియక తికమకపడుతున్న సమయంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు పరీక్ష పూర్తయ్యే వరకూ గంటపాటు చిన్నారిని ఆడించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో శనివారం తెలంగాణ హైకోర్టు ఆఫీస్ సబార్డినేట్ పరీక్ష నిర్వహించారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తమ చిన్నారిని తీసుకుని సెంటర్‌కు చేరుకున్నారు. లోపలికి వెళ్లేందుకు సమయం అవుతుండటంతో టెన్షన్ పడుతూ కనిపించారు. ఈ విషయమై ఆరా తీసిన మీర్‌పేట్ పీఎస్ హోంగార్డు కళ్యాణి, కానిస్టేబుళ్లు దుర్గ, కవిత చిన్నారిని తాము చూసుకుంటామని, పరీక్ష బాగా రాసి రావాలని సూచించడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు (పరీక్ష పూర్తయ్యే వరకూ) చిన్నారిని లాలించారు. ఇది చూసిన పలువురు అభ్యర్థులు పోలీసుల మానవత్వాన్ని అభినందించారు.



తల్లిదండ్రులు పరీక్షకు వెళ్లగా బాబును లాలిస్తున్న మహిళా పోలీసులు

మైనార్టీల అభివృద్ధికి కృషి

మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్



మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకం, రేవంతన్న భరోసా పథకం ద్వారా నియోజకవర్గంలోని 205 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా యువత, మహిళలకు రుణాలు అందించే వెసులుబాటు కల్పిస్తామని తెలిపారు. మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ నాయకుడు జనార్దన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డి.వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాయకులు దర్శన్, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, వీరేందర్‌రెడ్డి, ఆయా మండలాలకు చెందిన మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డులు మార్చేలా చూడండి

ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్‌కు రైతుల వినతి

యాచారం: ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల భూ రికార్డులను తిరిగి రైతుల పేర్లపై నమోదు చేసేలా కృషి చేయాలని తాడిపర్తి గ్రామ రైతులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు విన్నవించారు. నగరంలో శనివారం ఆయనను కలిసిన వారు ఫార్మాసిటీ భూసేకరణ చట్ట వ్యతిరేకంగా జరిగిందని, అవార్డులు అన్నీ రద్దు చేయాలని, టీజీఐఐసీ పేరు మీదున్న భూ రికార్డులను రైతుల పేర్లపై నమోదు చేయాలని హైకోర్టు స్పష్టంగా ఉత్తర్వులిచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. చట్ట విరుద్ధంగా ఫార్మాసిటీకి సేకరించిన భూములకు బలవంతంగా ఫెన్సింగ్ వేసి తమను వెళ్లకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన 2,211 ఎకరాల పట్టా భూమికి మరోచోట భూమి చూపించేలా సర్కార్‌పై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తాడిపర్తి మాజీ సర్పంచ్ దూస రమేశ్, టీజీఎస్ రాష్ట్ర నాయకులు దార సత్యం, సామ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



కోదండరామ్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

పాడిపరిశ్రమతో మంచి లాభాలు

షాబాద్‌: వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయని డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ అధికారి డా.కె కిషన్ కుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్ కొండల్‌రెడ్డి, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లారెడ్డిగూడలో శనివారం శాస్త్రీయ పద్ధతుల ద్వారా డెయిరీ, పాల ఉత్పత్తుల విలువల అభివృద్ధిపై రైతులకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతులు, ప్రభుత్వ పథకాల వినియోగం, వ్యాపార నైపుణ్యాల సాధన ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. పశుపోషణ, ఆవుల గదుల నిర్మాణం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే విధానాల వంటి అంశాలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా చేయగల మజ్జిగ, నెయ్యి, క్రీమ్ తయారీపై డెమో ఇచ్చారు. అనంతరం కోవా, కలాకండ్, పనీర్ చన్నా, రసగుల్లా, రసమలై, బాసుంది, మజ్జిగ, లస్సీ, ఫ్లేవర్డ్ మిల్క్, వే డ్రింక్స్ వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పశు ఆరోగ్య సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.



పాల ఉత్పత్తులపై మహిళలకు శిక్షణ

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



మాట్లాడుతున్న శ్రీకాంత్

షాద్‌నగర్: ఉపాధ్యాయులు విధి నిర్వాహణలో నిర్లక్ష్యం వహించడం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులు వారికి నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. వారితో పనులు చేయించడం సరికాదన్నారు. ఇటీవల నేరేళ్లపల్లి పాఠశాలలో విద్యార్థులతో మూత్రశాలలు కడిగించడం, పాటిగడ్డలో ఉపాధ్యాయులు విధులకు సెలవు పెట్టి సొంత పనులకు వెళ్లడం వెళ్ళడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతారన్నారు. అటువంటి ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శివశంకర్, ఆదిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



జశ్వంత్(ఫైల్)

చేవెళ్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన శనివారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన ప్రకారం.. పట్టణ కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన మెకానిక్‌గా రాము కుమారుడు జశ్వంత్(18) ఆదర్శ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. ఇంట్లో నుంచి వెళ్లిన జశ్వంత్ సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేశారు. స్విచ్ఛాఫ్ రావడంతో స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

స్కూల్ బస్ ఢీకొని బాలుడి మృతి

జగద్గిరిగుట్ట: స్కూల్ బస్ ఢీకొనడంతో బాలుడు మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు..షిరిడి హిల్స్ చెందిన ఏసి టెక్నీషియన్ ముఖేష్ చౌహాన్‌కు ఓ కుమారుడు జైసిత్ చౌహాన్ (10), కూతురు ఉన్నారు. శుక్రవారం షిరిడి హిల్స్ సమీపంలోని తులసి నగర్ చౌరస్తా వద్ద జైసిద్ చౌహన్ మరో బాలుడు సైకిల్ తొక్కుతూ వెళ్తున్న సమయంలో సైకిల్ అదుపుతప్పి జైసిట్ కిందపడ్డాడు. అదే సమయంలో ఆ వైపు వస్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు జైసిత్ చౌహన్ పైనుంచి వెళ్లడంతో ఆపస్మారక స్థితికి చేరుకున్నాడు. చుట్టూ ఉన్నవారు సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించగా చికిత్స చేస్తున్న సమయంలో శుక్రవారం రాత్రి జైసిట్ చౌహన్ మరణించాడు. పోలీసులు బస్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, బస్సును సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పంచాయతీలకు కొత్త భవనాలు

- నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి గ్రామాలకు ఈజీఎస్ నుంచి రూ.20 లక్షల చొప్పున నిధులు
- మరో ఏడు గ్రామాలకు ప్రతిపాదనలు



మంతన్‌గౌరెల్లిలో కొనసాగుతున్న పనులు

యాచారం: ఈజీఎస్ పథకం నుంచి రూ.20 లక్షల చొప్పున నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఏళ్ల క్రితం నిర్మించిన శిథిల భవనాల్లోనే ఇబ్బందుల నడుమ ప్రజాప్రతినిధులు, అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. వర్షాలకు నీరంతా గదుల్లోకి చేరి విలువైన రికార్డులు తడిసిపోయేవి. తాజాగా పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరవడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంతన్‌గౌరెల్లిలో భవన నిర్మాణ పనులు జోరందుకున్నాయి. నందివనపర్తిలో పనులు ప్రారంభించేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

తాడిపర్తి, చౌదర్‌పల్లి, తమ్మలోనిగూడ, ధర్మన్నగూడ, కేసీతండా, తక్కళ్లపల్లి తండా, అయ్యవారిగూడెం గ్రామాల్లోనూ నూతన పంచాయతీ భవనాల నిర్మాణాల కోసం ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించారు. తాడిపర్తి, చౌదర్‌పల్లి, తమ్మలోనిగూడ గ్రామాల్లో ఏళ్ల కింద నిర్మించిన భవనాలుండగా కేసీతండా, ధర్మన్నగూడెం, అయ్యవారిగూడెం, తక్కళ్లపల్లి తండాలు కొత్తగా గ్రామ పంచాయతీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ప్రస్తుతం ఈ నాలుగు గ్రామాల్లో ప్రభుత్వ భవనాల్లోనే పాలన కొనసాగుతుండగా, శాశ్వత భవన నిర్మాణాల కోసం నిధుల మంజూరుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైతే కొత్త పంచాయతీలకు సైతం శాశ్వత భవనాలు ఉంటాయని మండల పంచాయతీ అధికారి శ్రీలత తెలిపారు.

త్వరలో ప్రారంభిస్తాం



నందివనపర్తిలో ఏళ్ల కింద నిర్మించిన ఇరుకైన గదిలోనే పాలన కొనసాగిస్తున్నాం. సమావేశాల సమయంలో ఇబ్బంది అవుతుంది. పంచాయతీ, రెవెన్యూ, వైద్య, ఇతర సిబ్బంది వచ్చినప్పుడు కష్టంగా విధులు నిర్వర్తిస్తున్నాం. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– ఈర్లపల్లి శ్రీనువాస్, పంచాయతీ కార్యదర్శి, నందివనపర్తి

వీఎంహోంలో అంతర్జాతీయ యోగా వేడుకలు



మాట్లాడుతున్న అందెల శ్రీరాములు, చిత్రంలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: శరీరం, మనస్సు, ఆత్మను ఏకం చేసే విధానమే యోగా అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం మైదానంలో స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా వేడుకలకు ఎంపీతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ హాజరయ్యారు. యోగా గురువులు ఆసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రశాంతంగా జీవించాలంటే యోగా అవసరమన్నారు. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని, ప్రాచీన ఆధ్యాత్మిక పతంజలి యోగాను నిత్యం అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుజీత, ఇన్‌స్పెక్టర్లు సైదిరెడ్డి, వినోద్‌కుమార్, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కులంపేరిట దూషించిన వారిపై చర్యలకు డిమాండ్

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన బాధితుడు



ఫిర్యాదు కాపీని చూపుతున్న నర్సింలు

నందిగామ: తనను కులం పేరుతో దూషించిన వ్యక్తులపై నందిగామ ఠాణాలో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని మోత్కులగూడ గ్రామానికి చెందిన వానరాసి నర్సింలు శనివారం ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు ఫిర్యాదు కాపీలను స్థానిక విలేకరులకు అందజేశాడు. ఈ నెల 4న గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్లాటు విషయమై అధికారులతో మాట్లాడుతున్న సమయంలో గ్రామానికి చెందిన జెట్ట శంకరయ్య, జెట్ట రవి, జెట్ట హరీశ్ తనను గ్రామస్తుల సమక్షంలోనే కులం పేరుతో దూషించి, అవమానపరిచి, బెదిరించారని, ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు వారిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కొన్ని రోజులుగా తనను, తన కుటుంబ సభ్యులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్న శంకరయ్య, రవి, హరీశ్‌లపై విచారణ జరిపి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

డెకరేషన్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం



గోడౌన్‌లో ఎగిసిపడుతున్న మంటలు

పహాడీషరీఫ్: డెకరేషన్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. వాదే ముస్తఫా బస్తీలో వివాహాదిశుభకార్యాలకు వినియోగించే డెకరేషన్ సామగ్రి గోడౌన్ ఉంది. శనివారం సాయంత్రం పక్కనే ఉన్న చెత్తకుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో గోడౌన్‌కు మంటలు వ్యాపించాయి. డెకరేషన్ సామగ్రిలో ప్లాస్టిక్, ఫైబర్ ఉండడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. జనావాసాల నడుమ ఉన్న ఈ గోడౌన్ నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా ప్లేస్‌మెంట్ అచీవర్స్ డే



ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులతో యాజమాన్యం, సిబ్బంది

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం శేరిగూడలోని శ్రీదత్త విద్యా సంస్థల్లో శనివారం ప్లేస్‌మెంట్ అచీవర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2024- 25 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత పొంది, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. విద్యా సంస్థల చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు అత్యాధునిక టెక్నాలజీలో శిక్షణ ఇస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు వందశాతం ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నామని తెలిపారు. 46 మల్టీ నేషనల్ కంపెనీల్లో శిక్షణ ఇప్పిస్తూ పాటు వందశాతం ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అకాడమిక్స్ డీన్ వెంకట అచ్యుతరావు, ప్రిన్సిపాల్ సెంథిల్‌కుమార్, డాక్టర్ మదుసూధన్‌రెడ్డి, టీపీఓ డాక్టర్ మయూరి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో ఇద్దరి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియా ద్వారా పెట్టుబడుల పేరుతో ఎర వేసి, టోలిచౌకి ప్రాంతానికి చెందిన వ్యక్తి నుంచి రూ.74.36 లక్షలు కాజేసిన కేసులో ఇద్దరు నిందితులను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్ర పోలీసులు ఈ ద్వయాన్ని పట్టుకుని నగరానికి తీసుకువచ్చి శనివారం జైలుకు పంపారు. పుణేకు చెందిన రిషికేష్ జయవంత్ కాంబ్లే, మహ్మద్ సుల్తాన్ షేక్ వివిధ పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిచారు. వీటిని సైబర్ నేరాలు చేసే సూత్రధారులకు అందించి కమీషన్లు తీసుకుంటున్నారు. తమ యాప్ ద్వారా పెట్టుబడులు పెడితే భారీ లాభాలు ఉంటాయంటూ ఎర వేసి, దేశ వ్యాప్తంగా నేరాలు చేస్తున్న సూత్రధారులు బాధితుల నుంచి నగదును ఈ ఖాతాల్లోకే డిపాజిట్ చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరిపై నగరంలో మూడు కేసులతో పాటు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జమ్మూకాశ్మీర్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్‌ల్లో 35 కేసులు నమోదయ్యాయి. టోలిచౌకి బాధితుడి కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ ఎస్.దిలీప్ నేతృత్వంలోని బృందం పుణే ద్వయం పాత్ర గుర్తించి అరెస్టు చేసి తీసుకువచ్చింది.

డెంగీ వ్యాధితో రైల్వే ఉద్యోగి మృతి

అడ్డగుట్ట: డెంగీ వ్యాధితో రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైల్వే లోకో పైలెట్ సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగి రైల్వే ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయాడని తోటి రైల్వే లోకో పైలెట్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సనత్‌నగర్ జింకలవాడకు చెందిన మోనో కుమార్ (29) భార్య, రెండేళ్ల కూతురు ఉన్నారు. గత వారం రోజు నుంచి స్వల్ప జ్వరంతో బాధపడుతున్న మోనో కుమార్ ఈనెల 19వ తేదీన సికింద్రాబాద్ చిలకలగూడలో ఉన్న లోకల్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాడు. 20వ తేదీన డెంగీ వచ్చిందని మెడికల్ రిపోర్టులో రావడంతో ఆయన 21న సికింద్రాబాద్ లాలాగూడలోని కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. ఇతని ఆరోగ్య పరిస్థితి బాగాలేదని బావించి వైద్యులు మోనోకుమార్‌ను ఇతర కార్పొరేట్‌ఆస్పత్రికి తరలించాలని భావించి నిర్లక్ష్యం చేయడంతో అక్కడే చనిపోయారు. దీంతో తోటి ఉద్యోగులు, లోకో పైలట్లు ఆస్పత్రి ముందు ఆందోళన నిర్వహించారు. దీంతో కొద్దిసేపు ఆస్పత్రి ముందు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.